సాక్షి రంగారెడ్డి

శుక్రవారం । 8 । నవంబర్ । 2024



స్వామియే శరణం అయ్యప్ప

స్వామియే శరణం అయ్యప్ప.. అంటూ భక్తులు పెద్దఎత్తున మాలధారణకు సిద్ధమవుతున్నారు. 10లో▸



సమస్యలు పరిష్కరించాలి

కార్మికుల సమస్యలను పరిష్కరించాలని జీఎంఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తూర్పు రాంరెడ్డి పేర్కొన్నారు. 10లో▸



వ్యసనాల బారిన పడొద్దు

వ్యసనాల బారిన పడి జీవితాలను నాశనం చేసుకోవద్దని డీవైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు ఆలంపల్లి జంగయ్య సూచించారు. 10లో▸

న్యూస్‌రీల్

నిబంధనలు మీరితే చర్యలు

జిల్లా వ్యవసాయాధికారి నరసింహారావు



ఎరువుల నిల్వలను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి నరసింహారావు

కడ్తాల్: ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఎరువులు విక్రయించాలని జిల్లా వ్యవసాయాధికారి బి.నరసింహారావు ఆదేశించారు. మండల కేంద్రంతో పాటు మండల పరిధిలోని రావిచేడ్, ముద్విన్ గ్రామాల్లోని ఎరువుల, విత్తన దుకాణాల్లో వ్యవసాయ శాఖ అధికారులతో కలిసి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయా షాపుల్లో యూరియా, కాంప్లెక్స్ ఎరువుల నిల్వలు, విక్రయాలు, స్టాక్ రిజిస్టర్లను పరిశీలించారు. ఎరువులు, విత్తనాలను ఎంత ధరకు విక్రయిస్తున్నారు తదితర వివరాలను నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రైతులకు ఈపాస్ ద్వారానే ఎరువులు విక్రయించాలని తెలిపారు. అధిక ధరలకు ఎరువులు, విత్తనాలు, పురుగు మందులు విక్రయిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. రైతులకు ఇబ్బందులు కలుగకుండా చూడాలని, ఎరువులు, విత్తనాలు కొనుగోలు చేసినప్పుడు రసీదు తప్పనిసరిగా ఇవ్వాలని, దుకాణాల ఎదుట ధరల పట్టిక, ఎరువుల నిల్వలను సూచించే బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఏఓ శ్రీలత, ఏఈఓ అభినవ్‌రెడ్డి, ఫెర్టిలైజర్స్ షాపుల నిర్వాహకులు జితేందర్‌రెడ్డి, వెంకటేశ్, సుఖేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నందిగామను సందర్శించిన ఎన్ఐఆర్‌డీ బృందం



మహిళా సంఘం సభ్యులతో ఎన్ఐఆర్‌డీ బృందం

నందిగామ: నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్ (ఎన్ఐఆర్‌డీ) బృందం గురువారం మండల కేంద్రాన్ని సందర్శించింది. గోవా నుంచి వచ్చిన 30 మందితో కూడిన బృందం సభ్యులు ఈ పర్యటనలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహిళా సమాఖ్యలో సంఘం సభ్యులు తీసుకున్న రుణాలు, ఏ విధంగా ఆర్థికంగా ఎదుగుతున్నారు.. స్వయం ఉపాధి ఏ విధంగా పొందుతున్నారు.. తీసుకున్న రుణాలను తిరిగి ఎలా చెల్లిస్తున్నారు.. ఎంత మందికి ఉపాధి కల్పిస్తున్నారు తదితర విషయాలను ఏపీఎం యాదగిరితో పాటు మహిళా సంఘం సభ్యులను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ పథకాలను ఏ విధంగా సద్వినియోగం చేసుకుంటున్నారు.. మహిళా సంఘం సభ్యుల జీవనోపాధిని ఏ విధంగా మెరుగుపర్చుకున్నారు అనే విషయాలపై సమగ్ర సమాచారం సేకరించి సంతృప్తి వ్యక్తం చేశారు. దీంతో పాటు మహిళలు ఏర్పాటు చేసిన పలు వ్యాపార కేంద్రాలను సందర్శించారు. వారివెంట ఎన్ఐఆర్‌డీ అధికారి వెంకటేశ్వర్లు, ఏపీఎం యాదగిరి, సమాఖ్య అధ్యక్షురాలు అమృత, సీసీలు రజని, అనురాధ, యాదయ్య ఉన్నారు.

దివ్యాంగుల సమస్యలు పరిష్కరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న అడివయ్య

షాద్‌నగర్‌రూరల్: ఎన్నికల సమయంలో దివ్యాంగుల పెన్షన్ పెంపుపై ఇచ్చిన హామీని ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని దివ్యాంగుల హక్కుల జాతీయ వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అడివయ్య డిమాండ్ చేశారు. పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఆవరణలో గురువారం దివ్యాంగుల హక్కుల జాతీయ వేదిక జిల్లా అధ్యక్షుడు భుజంగరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన రూ.6వేల పెన్షన్ పెంపు హామీని ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నించారు. దివ్యాంగులకు కనీస పెన్షన్‌ను కేంద్ర ప్రభుత్వం రూ.10వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. దివ్యాంగుల సమస్యల సాధనకోసం డిసెంబర్‌లో రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమాన్ని చేపట్టనున్నట్టు తెలిపారు. దివ్యాంగుల హక్కుల జాతీయ వేదిక జిల్లా కార్యదర్శి రాజు మాట్లాడుతూ.. రాష్ట్రంలో దివ్యాంగుల సంక్షేమశాఖలో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని అన్నారు. సమావేశంలో దివ్యాంగుల హక్కుల జాతీయ వేదిక సభ్యులు శేఖర్‌గౌడ్, సంతోష, తదితరులు పాల్గొన్నారు.

మార్గానికి మార్కింగ్

‘గ్రీన్‌ఫీల్డ్’కు వడివడిగా అడుగులు

- తొమ్మిది గ్రామాలు.. 449.27 ఎకరాలు
- రహదారి కోసం భూ సేకరణ
- ఇప్పటికే నోటిఫికేషన్ జారీ
- క్రయవిక్రయాలపై ఆంక్షలు
- ఆయా గ్రామాల్లో మార్కింగ్ మరూ

సాక్షి, రంగారెడ్డిజిల్లా: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్మించతలపెట్టిన ఫోర్త్‌సిటీ కోసం ఎలివేటెడ్ గ్రీన్ ఫీల్డ్ రహదారి నిమిత్తం భూ సేకరణ ప్రక్రియను వేగవంతం చేసింది. మూడు మండలాల పరిదిలోని తొమ్మిది గ్రామాల మీదుగా ఆరు లేన్లు(300 అడుగుల వెడల్పు)గా ఈ రోడ్డును ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొంది. ఈ మేరకు ప్రభుత్వం (రెవెన్యూశాఖ) భూ సేకరణ కోసం ఇటీవల (జీ2/349/2024) నోటిఫికేషన్ సైతం జారీ చేసింది. భూసేకరణ చట్టం-2016 (యాక్ట్21/2017)తో పాటు పునరావాస కల్పన చట్టం-2013 (యాక్ట్ 20/2013) ద్వారా భూసేకరణ చేస్తున్నట్లు ప్రకటించింది. నోటిఫికేషన్‌లో పేర్కొన్న భూ యజమానులెవరూ చట్టంలోని సెక్షన్ 11(4) కింద ఈ భూమిలో ఎలాంటి లావాదేవీలు నిర్వహించరాదని పేర్కొంది. రుణాల కోసం కూడా ఈ భూములను తాకట్టు పెట్టొద్దని సూచించింది. అభ్యంతరాలను నోటిఫికేషన్ వెలువడిన 60 రోజుల్లో దాఖలు చేయొచ్చని సూచించింది.





కందుకూరు మండలం లేమూరు, తిమ్మాపూర్‌లో వేసిన మార్కింగ్

రహదారి వెంట మెట్రో కూడా..

ఓఆర్ఆర్ ఎగ్జిట్ 13 నుంచి మీర్‌ఖాన్‌పేటలో ప్రభుత్వం కొత్తగా ఏర్పాటు చేయాలని భావించిన స్కిల్ యూనివర్సిటీ వరకు 6 లేన్ల రోడ్డు నిర్మాణానికి 449.27 ఎకరాల భూమి అవసరమని ప్రాథమికంగా అంచనా వేసింది. ఈ మేరకు మహేశ్వరం మండలం కొంగరకుర్దు-ఎ, ఇబ్రహీంపట్నం మండలం ఫిరోజ్‌గూడ, కొంగరకలాన్, కందుకూరు మండలం లేమూరు, రాచలూరు, తిమ్మాపూర్, గుమ్మడవెల్లి, పంజాగూడ, మీర్‌ఖాన్‌పేట్ వరకు 449.27 ఎకరాల భూమి సేకరించనున్నట్లు పేర్కొంది. ఇప్పటికే ఆయా మార్గాల్లో మార్కింగ్ కూడా చేసింది. ఈ గ్రీన్‌ఫీల్డ్ రోడ్డు వెంటే.. మెట్రో రైలు విస్తరణ పనులు చేపట్టనుంది.

ఎక్కడ ఎంతంటే?

- ఇబ్రహీంపట్నం మండలం ఫిరోజ్‌గూడలో 84 మంది రైతుల నుంచి 1.03 ఎకరాలు.
- కొంగరకలాన్‌లో 361 మంది రైతుల నుంచి 55.05 ఎకరాలు.
- మహేశ్వరం మండలం కొంగరకుర్దులో 278 మంది రైతుల నుంచి 53.20 ఎకరాలు.
- కందుకూరు మండలం లేమూరులో 497 మంది రైతుల నుంచి 84.28 ఎకరాలు.
- తిమ్మాపూర్ రెవెన్యూలో 290 మంది రైతుల నుంచి 47.02 ఎకరాలు.
- రాచలూరు రెవెన్యూలో 351 మంది రైతుల నుంచి 87.22 ఎకరాలు.
- గుమ్మడవెల్లి రెవెన్యూలో రిజర్వు ఫారెస్ట్ స్థలం 32.11 ఎకరాలు.
- పంజాగూడ రెవెన్యూలో టీజీఐఐసీ నుంచి 18.33 ఎకరాలు.
- మీర్‌ఖాన్‌పేటలో 48 మంది రైతుల నుంచి 62.08 ఎకరాల చొప్పున సేకరించనున్నారు.



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ నారాయణరెడ్డి

ధాన్యం కొనుగోలుకు చర్యలు

కలెక్టర్ నారాయణరెడ్డి

సాక్షి, రంగారెడ్డిజిల్లా: వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను సత్వరమే ప్రారంభించాలని కలెక్టర్ సి.నారాయణ రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ మేరకు గురువారం సమీకృత జిల్లా కార్యాలయ సముదాయ భవనంలోని సమావేశ మందిరంలో వరి ధాన్యం కొనుగోలుపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లా వ్యాప్తంగా వరి ధాన్యం కొనుగోలు చేసేందుకు వీలుగా ఇప్పటి వరకు 39 కేంద్రాలను ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు అన్ని చర్యలు తీసుకోవాలని అన్నారు. రైతులు పండించిన ధాన్యం గ్రేడ్- ఏ రకానికి రూ.2,320, సాధారణ రకానికి రూ.2,300, సన్నరకం ధాన్యానికి అదనంగా రూ.500 చెల్లించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. రైతులు చెత్త, తేమ లేకుండా ఆరబెట్టిన ధాన్యం కొనుగోలు కేంద్రాలకు తెచ్చేలా అవగాహన కల్పించాలన్నారు. కొనుగోలు కేంద్రాల్లో మౌలిక సదుపాయాలతో పాటు అవసరమైన గన్నీ బ్యాగులను అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. రైతులు, మిల్లర్లను సమన్వయం చేసుకుంటూ కొనుగోళ్లను వేగవంతం చేయాలని, ఎప్పటికప్పుడు ధాన్యాన్ని రైస్ మిల్లర్లకు చేరేలా వాహనాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఏరోజు ధ్యానం అదేరోజు కొనుగోలు చేసేందుకు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. సమీక్ష సమావేశంలో అదనపు కలెక్టర్ ప్రతిమా సింగ్, డీఆర్ఓ సంగీత, జిల్లా పౌరసరఫరాల అధికారి శ్రీనివాస్, జిల్లా మేనేజర్ గోపీకృష్ణ, వ్యవసాయ శాఖ అధికారి నర్సింహా రావు, మార్కెటింగ్ శాఖ అధికారి రియాజొద్దీన్, డీసీసీఓ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర సర్వేకు సహకరించాలి

మణికొండ: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఇంటింటి కుటుంబ సర్వేకు ప్రజలు సహకరించాలని కలెక్టర్ సి.నారాయణరెడ్డి అన్నారు. నార్సింగి మున్సిపల్ పరిధిలోని కోకాపేటలో కొనసాగుతున్న సర్వే తీరును గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా అపార్ట్‌మెంట్‌లలో సర్వే చేస్తున్న ఎన్యూమరేటర్‌ను వివరాలు అడిగి తెలుసుకున్నారు. సర్వే సందర్భంగా సమగ్ర వివరాలు తీసుకున్న అనంతరం ఇంటికి అతికించిన స్టిక్కర్, వాటిపై నమోదు చేసిన ఇంటి నంబర్, ఎన్యూమరేషన్ బ్లాక్, క్రమ సంఖ్య తదితర వివరాలను క్షుణ్ణంగా పరిశీలించారు. సర్వే చేయాల్సిన విధానం, వివరాల సేకరణపై ఎన్యూమరేటర్లకు పలు సూచనలు చేశారు. సర్వేకు వచ్చే అధికారులు, సిబ్బందికి ప్రజలు వాస్తవ సమాచారాన్ని మాత్రమే అందించాలన్నారు. ఎలాంటి తప్పిదాలు లేకుండా సర్వే పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ టి.కృష్ణమోహన్‌రెడ్డి, ఇతర అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అనుమతి లేకుండా ఈవెంట్

- ఫాంహౌస్‌కు రూ.లక్ష జరిమానా
- నిర్వాహకుడి బైండోవర్

మొయినాబాద్: అనుమతి లేకుండా ఈవెంట్ నిర్వహించి మద్యం వినియోగించిన ఫాంహౌస్‌కు ఎక్సైజ్ అధికారులు రూ.లక్ష జరిమానా విధించారు. చేవెళ్ల ఎక్సైజ్ సీఐ శ్రీలత తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని అరవిల ఫాంహౌస్‌లో గత ఏడాది ఎలాంటి అనుమతి లేకుండా ఈవెంట్ నిర్వహించి మద్యం వినియోగించారు. అప్పట్లో ఎక్సైజ్ పోలీసులు కేసు నమోదు చేసి ఫాంహౌస్ నిర్వాహకుడిని తహసీల్దార్ గౌతంకుమార్ ఎదుట హాజరుపర్చి బైండోవర్ చేశారు. బైండోవర్ నిబంధనలను ఉల్లంఘించి ఫాంహౌస్ నిర్వాహకుడు ఇటీవల తిరిగి ఈవెంట్ నిర్వహించి మద్యం వినియోగించారు. చేవెళ్ల ఎక్సైజ్ పోలీసులు ఫాంహౌస్‌పై దాడిచేసి పట్టుకున్నారు. గురువారం తహసీల్దార్ గౌతంకుమార్ ఎదుట హాజరుపర్చి బైండోవర్ నిబంధనలను ఉల్లంఘించినందుకు రూ.లక్ష జరిమానా విధించారు. చేవెళ్ల ఎక్సైజ్ సర్కిల్ పరిధిలోని మొయినాబాద్, శంకర్‌పల్లి, షాబాద్, చేవెళ్ల మండలాల్లోని ఫాంహౌస్‌లలో అనుమతి లేకుండా ఈవెంట్స్ నిర్వహించి మద్యం వినియోగిస్తే కఠిన చర్యలు తప్పవని ఎక్సైజ్ సీఐ శ్రీలత హెచ్చరించారు. ఎవరైనా ఈవెంట్ నిర్వహిస్తే ఎక్సైజ్ శాఖ నుంచి తప్పనిసరిగా అనుమతి తీసుకోవాలని స్పష్టం చేశారు.



తహసీల్దార్ ఎదుట ఫాంహౌస్ నిర్వాహకుడిని బైండోవర్ చేస్తున్న ఎక్సైజ్ పోలీసులు

ప్రజా సంక్షేమం కోసమే సర్వే

జిల్లా విద్యాధికారి సుశీంధర్ రావు

మహేశ్వరం: ప్రజల అభివృద్ధి, సంక్షేమం కోసమే ప్రభుత్వం ఇంటింటి సర్వే చేపడుతోందని జిల్లా విద్యాధికారి, డివిజన్ సమగ్ర కుటుంబ సర్వే పరిశీలకుడు సుశీంధర్‌రావు పేర్కొన్నారు. మండల పరిధిలోని మన్సాన్‌పల్లిలో జరుగుతున్న సమగ్ర కుటుంబ సర్వేను గురువారం ఆయన అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. సర్వేకు ప్రజలంతా సహకరించాలని అన్నారు. అధికారులు వారికి సూచించిన ఇళ్లను సందర్శించి వివరాలు సేకరించాలన్నారు. సర్వేలో ప్రశ్నలకు సమాధానాలు చెప్పాలనే ఒత్తిడి ఉండదని, ఎలాంటి పత్రాలను ప్రజల నుంచి తీసుకోరని స్పష్టం చేశారు. సర్వే సమయంలో ఇంట్లో ఒకరు ఉన్నా సరిపోతుందన్నారు. ప్రతి ఒక్కరూ సమగ్ర సర్వేలో భాగస్వాములు కావాలని సూచించారు. ప్రస్తుతం కుటుంబాలను గుర్తించేందుకు ఇంటింటికీ అధికారులు, సిబ్బంది తిరిగి స్టిక్కర్లు అతికించి అవగాహన కల్పిస్తున్నారని తెలిపారు. అంతకు ముందు సమగ్ర సర్వే చేస్తున్న అధికారులు, సిబ్బందితో మాట్లాడారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శైలజ, మండల విద్యాధికారి కస్నా నాయక్, ఉపాధ్యాయులు ఆనంద్, జానకిరామ్, పంచాయతీ కార్యదర్శి ఎండీ జావీదు పాల్గొన్నారు.

‘పట్నం’లో జిల్లా కోర్టు

ఇబ్రహీంపట్నం కోర్టు ఆవరణలో ఏర్పాటు

- నేడు వర్చువల్‌గా ప్రారంభం
- ఏర్పాట్లు చేసిన అధికారులు
- ఇబ్రహీంపట్నం, మహేశ్వరం నియోజకవర్గాల ప్రజలకు వెసులుబాటు

ఇబ్రహీంపట్నం రూరల్: ఇబ్రహీంపట్నంకు జిల్లా కోర్టు వచ్చేసింది. ఇన్నాళ్లు నగరంలోని ఎల్‌బీనగర్‌కు వెళ్లే బాధ ఇకపై ఇబ్రహీంపట్నం, మహేశ్వరం నియోజకవర్గాల్లో ఉన్న ప్రజలకు తప్పనుంది. 15వ అదనపు జిల్లా, సెషన్స్ జడ్జితో పాటు 15వ అదనపు మెట్రోపాలిటన్ సెషన్స్ జడ్జి న్యాయస్థానం శుక్రవారం ఇబ్రహీంపట్నం కోర్టు ఆవరణలో అధికారికంగా ప్రారంభం కానుంది. దీంతో ఉద్యోగులు, న్యాయవాదులు, పోలీసులు, బాధితులు, కక్షిదారులకు తిప్పలు తప్పనున్నాయి. ఇప్పటికే ఇబ్రహీంపట్నంలో రెండు సీనియర్ సివిల్‌కోర్టులు, రెండు జూనియర్ సివిల్ కోర్టులు ఉన్నాయి. మహేశ్వరం, కందుకూరు, మాడ్గుల, ఇబ్రహీంపట్నం, మంచాల, యాచారం ప్రాంతాల్లో ఉన్న ప్రజలకు పోలీస్ స్టేషన్లలో కేసులు ఇక్కడ పరిష్కారం అయ్యేవి. ఈ నాలుగు కోర్టులకు అదనంగా జిల్లా కోర్టు రావడంతో మరింత సులభతరం కానుంది. రంగారెడ్డి జిల్లా కోర్టు ఇబ్రహీంపట్నం రావడంతో కేసులకు త్వరితగతిన పరిష్కారం చూపనున్నారు. 15వ అదనపు జిల్లా, సెషన్స్ జడ్జి, 15వ అదనపు మెట్రోపాలిటన్ సెషన్స్ జడ్జి న్యాయ స్థానం నేటి నుంచి అందుబాటులోకి రానుంది. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు, క్రిమినల్ కేసులు మాత్రమే పైకి వెళ్లనున్నాయి. శుక్రవారం సాయంత్రం 4.45 గంటలకు హైకోర్టు చీఫ్ జస్టిస్ అలోక్ అరాదే, జస్టిస్ సామ్ కోషి, జస్టిస్ లక్ష్మణ్, జస్టిస్ విజయసేన్‌రెడ్డి వర్చువల్‌గా ప్రారంభించనున్నారు. నేరుగా రంగారెడ్డి ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ సెషన్స్ జడ్జి శశిధర్‌రెడ్డి హాజరై ప్రారంభిస్తారు.



జిల్లాకోర్టును ప్రారంభించేది ఈ భవనంలోనే..

కోర్టుల కోసం ఐదెకరాల కేటాయింపు

రోజురోజుకూ పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా కోర్టులు అందుబాటులో ఉండటం కోసం ఇటీవలే ప్రభుత్వం రంగారెడ్డి జిల్లా కోర్టు ఏర్పాటుకు ఇబ్రహీంపట్నంలోని నమాజ్‌గడ్డలో 5 ఎకరాల విస్తీర్ణం గల సర్కార్ భూమిని కేటాయించింది. న్యాయశాఖ నుంచి నిధులు మంజూరు చేసిన తర్వాతే పనులు ప్రారంభం కానున్నాయి. ఇబ్రహీంపట్నం చెరువుకు సమీపంలో 100 ఫీట్ల రోడ్డుకు ఆనుకొని ఈ భూమిని కేటాయించారు. ఇప్పటికు వరకు ఇరుగ్గా ఉన్న కోర్టు ఆవరణ కొత్తగా కేటాయించిన భూమిలో నిర్మాణం జరిగితే సువిశాలం కానుంది.

శుభపరిణామం

జిల్లా కోర్టు లేకపోవడంతో కొన్నేళ్లుగా స్థానిక ప్రజలు అనేక అవస్థలు పడుతున్నారు. ఏవైనా కేసుల కోసం నగరానికి వెళితే పనులు సరిగా అయ్యేవి కాదు. అంతపెద్ద కాంప్లెక్స్‌లో ఎక్కడికి వెళ్లాలో తెలియడం కష్టంగా ఉండేది. ఇప్పుడు జిల్లా కోర్టును అందరికీ అందుబాటులోకి తీసుకురావడం శుభపరిణామం.

– సీహెచ్ రవి, న్యాయవాది

కార్మిక సమస్యలు పరిష్కరించాలి



పరిశ్రమలో బీఎంఎస్ కార్మికుల సంబరాలు

బీఎంఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాంరెడ్డి

మొయినాబాద్ రూరల్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వివిధ కంపెనీల్లో పని చేస్తున్న కార్మికుల సమస్యలను పరిష్కరించాలని బీఎంఎస్(భారతీయ మజ్దూర్ సంఘ్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తూర్పు రాంరెడ్డి పేర్కొన్నారు. గురువారం మండల పరిధిలోని అజీజ్‌నగర్ సమీపంలో గల రాణే ఇంజన్ వాల్ పరిశ్రమలో బీఎంఎస్ ఎన్నికల గెలుపు సంబరాలను నిర్వహించారు. బుధవారం కార్మిక శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఎన్నికల్లో బీఎంఎస్ వరుసగా బీఆర్ఎస్ కార్మిక సంఘంపై మూడోసారి ఘన విజయం సాధించింది. బుధవారం జరిగిన ఎన్నికల్లో 141 ఓట్ల మెజార్టీతో బీఎంఎస్ గెలవగా బీఆర్ఎస్ కార్మిక సంఘానికి 27 ఓట్లు లభించాయి. దీంతో గురువారం మధ్యాహ్నం రాణే ఇంజన్ వాల్ పరిశ్రమలో విజయోత్సవ సంబరాలను వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తూర్పు రాంరెడ్డి గెలుపుపై హర్షం వ్యక్తం చేసి మాట్లాడుతూ.. యూనియన్ స్థాపించిన నాటి నుంచి కార్మికులకు సేవలు అందిస్తున్నట్లు సూచించారు. రాణే కార్మికులకు చెక్కు చెదరని విశ్వాసం బీఎంఎస్‌పై ఉన్నందుకు హర్షం వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా బీఎంఎస్ సంఘటిత, అసంఘటిత రంగాల్లో కార్మికులకు ఎనలేని సేవలుందిస్తున్నామని పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా కార్మికుల కనీస వేతన జీఓలను సవరించి రూ.25 వేలకు పెంచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ కార్యవర్గ సభ్యుడు శ్రీనివాస్, వెంకటేశ్వర్‌రావు, పవన్‌కుమార్, శ్రీరాములు, బాలరాజ్, కార్మిక సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

కన్నతండ్రే కాలయముడు

కొడుకును కిరాతకంగా హత్య చేసిన తండ్రి

మాడ్గుల: కన్న కొడుకును తండ్రే కిరాతకంగా హత్య చేసిన సంఘటన మాడ్గుల మండల స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండల పరిధిలోని గుడితండా గ్రామానికి చెందిన రాత్లావత్ లక్ష్మణ్‌కు ఇద్దరు కొడుకులు, ముగ్గురు కూతుళ్లు ఉన్నారు. పెద్దకొడుకు నరేశ్, చిన్న కొడుకు సురేశ్‌లు హైదరాబాద్‌లోని బాగ్‌లింగంపల్లిలో ఉంటూ ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్నారు. సంవత్సరాలుగా అక్కడే నివసిస్తున్నారు. వారు గత నెల 11న దసరా పండుగకు సొంత గ్రామానికి వచ్చారు. 13వ తేదీన తండ్రి లక్ష్మణ్, పెద్ద కొడుకు నరేశ్ ఇద్దరు కలిసి మద్యం మత్తులో చిన్న కొడుకు సురేశ్‌ను కిరాతకంగా మటన్ కొట్టే కత్తితో గొంతుపైన పలుసార్లు దాడి చేసి చంపినట్లు సీఐ జగదీశ్ తెలిపారు. అనంతరం మృతదేహాన్ని ఆటోలో తీసుకెళ్లి పొలంలో గుంతలో వేసి పూడ్చినట్లు చెప్పారు. దీంతో ఎవరికీ అనుమానం రాకుండా హైదరాబాద్‌కు వెళ్లారు. గురువారం మాడ్గుల పోలీస్ స్టేషన్‌కు నిందితులు వచ్చి చేసిన నేరాన్ని అంగీకరించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. హత్యకు గల కారణాలు ఆస్తి గొడవలు, కొట్లాటలే అని ప్రాథమిక విచారణలో తేలిందని సీఐ పేర్కొన్నారు. పూర్తి విచారణ అనంతరం సమగ్ర సమాచారం తెలుపుతామని పోలీసులు వివరించారు.

స్వామియే శరణం అయ్యప్ప

- భక్తిశ్రద్ధలతో చేపడుతున్న అయ్యప్ప స్వామి దీక్షలు
- ఏటా పెరుగుతున్న భక్తులు



లక్ష్మరావుగూడలో పడిపూజ చేస్తున్న అయ్యప్పస్వాములు (ఫైల్)

షాబాద్: స్వామియే శరణం అయ్యప్ప అంటూ భక్తులు పెద్దఎత్తున మాలధారణకు సిద్ధమవుతున్నారు. స్వామి శరణుఘోషల మధ్య దీక్షను స్వీకరించి కఠోర బ్రహ్మచర్యాన్ని అవలంబిస్తున్నారు. అయ్యప్ప స్వామి దీక్షతో సంపూర్ణ ఆరోగ్యం కలుగుతుందని భక్తులు పూర్తిగా విశ్వసిస్తారు. ఏటా హిందువులు పవిత్రంగా భావించే కార్తీక మాసంలో అయ్యప్ప స్వామి దీక్షను చేపడుతారు. అక్టోబర్, నవంబర్, డిసెంబర్ మాసాల్లో పెద్దఎత్తున అయ్యప్ప స్వామి దీక్షను స్వీకరిస్తున్నారు. అయ్యప్పస్వాములు కార్తీక మాసంలో కఠోర దీక్షతో ప్రత్యేక పూజలు నిర్వహిస్తుంటారు. ఉదయం, సంధ్యా వేళల్లో చన్నీటి స్నానాలు ఆచరించి ఒకపూట భోజనంతో నేలపై నిద్రించాలి. రుతు స్త్రీలు, శవ యాత్రలు ఎదురైతే వెంటనే తలస్నానం ఆచరించి అయ్యప్పస్వామికి హారతి ఇచ్చి శరణుఘోష చెప్పుకోవాలి. సూర్యుడు ఉదయించే వైపు మూత్ర విసర్జన చేయరాదు. మాలధారణ చేసిన వ్యక్తి తన భార్యను అయినా సరే మాళికాపురోత్తమ్మ అంటూ పిలవాల్సి ఉంటుంది. అయ్యప్ప మాలధారణ చేయించే గురుస్వామిని భక్తితో పూజించాలి. షాబాద్ మండలంలో ఈ ఏడాది దాదాపు వేయి మందికి పైగా స్వాములు మాలధారణ చేయనున్నట్లు అంచనా. అంతేకాకుండా 41 రోజులు దీక్షను పూర్తి చేసిన భక్తులకు ఇరుముడిని గురుస్వామి కడతారు. గురుస్వాముల ఆధ్వర్యంలో జరిగే అయ్యప్పస్వామి మహాపడిపూజల్లో భక్తులు భజనా కార్యక్రమాలలో మునిగితేలుతారు. అయ్యప్ప కీర్తనలు ఎంతటి హేతువాదినైనా క్షణాల్లో భక్తి పారవశ్యంతో మునిగిపోయేలా చేస్తాయి.

దీక్షతో కలిగే ఫలితాలు

అయ్యప్ప దీక్ష స్వీకరించడంతో సమాజంలోని కులమత భేదాలు, పేద, ధనిక తారతమ్యాలు కనిపించవు. దీక్ష సమయంలో ఉపవాసం ఉండడంతో జీర్ణ వ్యవస్థకు విశ్రాంతి లభిస్తుంది. దీనివల్ల ఆరోగ్యం మెరుగుపడుతుంది. ఉపవాసాలతో రక్తం, జీర్ణవ్యవస్థ శుద్ధి అవుతాయి. శరీరంలో స్థాయికి మించిన కొవ్వు ఉంటే కరిగిపోతుంది. మనస్సును దుష్ట తలవంపుల నుంచి ప్రాపంచిక ఆందోళనల నుంచి దూరం చేసుకోలేని అన్ని భాగాలను ప్రభావితం చేస్తుంది. గంధం, కుంకుమ, విభూతి, తులసిమాల ధరించడంతో నాడీ వ్యవస్థ బాగా పనిచేస్తుంది. శరీర ఉష్ణోగ్రతను క్రమబద్ధీకరిస్తాయి. సామూహిక పూజలు, భజనలతో మానసిక రోగాలు తొలగిపోతాయి.

దీక్షలో రకాలు

మొదటిసారి:	కన్నెస్వామి
రెండోసారి:	కత్తిస్వామి
మూడోసారి:	గంటస్వామి
నాలుగోసారి:	గదస్వామి
ఐదోసారి:	పెరుస్వామి
ఆరోసారి:	గురుస్వామి
ఏడు,అంతకన్నా ఎక్కువసార్లు:	పెరుగురు స్వాములు
18సార్లు, అంతకన్నా ఎక్కువసార్లు:	నారికేళ స్వాములు

భక్తిభావంతో ఉండాలి



గత 25 ఏళ్లుగా అయ్యప్ప స్వామి మాల ధరిస్తున్నా. మాల ధరించిన భక్తులు 41 రోజులు(మండల కాలం) స్వామిని పూజిస్తూ భక్తి భావంతో కలిగి ఉండాలి. స్వామియే శరణం అయ్యప్ప అంటూ దైవ చింతనతోనే గడపాలి. చెప్పులు లేకుండా నడవడంతో రక్త ప్రసరణ సాఫీగా సాగుతుంది.

– రవీందర్‌గౌడ్, గురుస్వామి, షాబాద్

మధురానుభూతి



అయ్యప్ప స్వామిని స్మరిస్తూ సేవలో గడపడం మధురానుభూతిని కలిగిస్తుంది. 20 ఏళ్లుగా క్రమం తప్పకుండా మాల ధరించి దీక్ష తీసుకుంటున్నా. ఆరోగ్య పరిరక్షణతో పాటు ఆర్థికంగా కలిసి వస్తుండటం అయ్యప్పస్వామి దర్శన భాగ్యమేనని విశ్వసిస్తున్నా. నూతన దేవాలయ నిర్మాణానికి కృషి చేస్తున్నా.

– వెంకటేశ్, గురుస్వామి, నాగర్‌గూడ

ఆరోగ్యానికి మేలు



అయ్యప్ప మాలధారణ నియమ నిష్ఠలతో ఆరోగ్యం బాగుటుంది. సూర్యోదయం కన్న ముందు సూర్యాస్తమయం తరువాత రోజుకు రెండుసార్లు స్నానం చేయడం, ఒకపూట భోజనంతో మానసిక ఉల్లాసం పెరుగుతుంది. ఏటా క్రమం తప్పకుండా మాలధారణ వేస్తున్నా.

– అవినాశ్‌రెడ్డి, మాజీ ఎంపీపీ, షాబాద్

హెరాయిన్ పట్టివేత

సాక్షి, సిటీబ్యూరో: నార్కోటిక్ డ్రగ్స్ విక్రయిస్తున్న పశ్చిమబెంగాల్‌కు చెందిన ముగ్గురు వ్యక్తులను ఎక్సైజ్ పోలీసులు పట్టుకున్నారు. వారి నుంచి రూ.3.50 లక్షల విలువైన హెరాయిన్‌ను స్వాధీనం చేసుకున్నారు. శంషాబాద్, శేరిలింగంపల్లి ప్రాంతాల్లో డ్రగ్స్ విక్రయిస్తున్నట్లు సమాచారం అందడంతో దాడులు నిర్వహించారు. వారి నుంచి 70 గ్రాముల హెరాయిన్ స్వాధీనం చేసుకున్నారు. నిందితుల్లో వెస్ట్ బెంగాల్‌కు చెందిన అజ్మల్ హుస్సేన్, నూర్ ఆజంఖాన్, ఎస్‌కె సురోజ్ ఉన్నారు.

వ్యసనాల బారిన పడొద్దు

డీవైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు జంగయ్య



డ్రగ్స్ నిర్మూలనపై మాట్లాడుతున్న జంగయ్య

యాచారం: యువతి, యువకులు పాఠశాల, కళాశాల స్థాయి నుంచే గొప్ప లక్ష్యాన్ని ఎంచుకోవాలని డీవైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు ఆలంపల్లి జంగయ్య సూచించారు. వ్యసనాల బారిన పడి జీవితాలను నాశనం చేసుకోవద్దని కోరారు. మండల పరిధిలోని మాల్ కేంద్రంలో గురువారం డ్రగ్స్, గంజాయి నిర్మూలన అంశంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు, యువత జీవితాలను పాడు చేసుకోవద్దని, కష్టపడి చదువుకుని ఉన్నత ఉద్యోగాలు సాధించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు తరంగ్, విప్లవ్‌కుమార్, రమేష్, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

నవజాత శిశువు అపహరణకు యత్నం

నిందితురాలి అరెస్ట్



నిందితురాలు అక్సరీ బేగం

సుల్తాన్‌బజార్: అప్పుడే పుట్టిన నవజాత శిశువును కిడ్నాప్ చేసేందుకు యత్నించిన పాత నేరస్తురాలిని సుల్తాన్‌బజార్ ప్రభుత్వ ప్రసూతి ఆసుపత్రి సెక్యూరిటీ సిబ్బంది టీజీఎస్‌పీఎఫ్ పోలీసులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకుని సుల్తాన్‌బజార్ పోలీసులకు అప్పగించిన సంఘటన గురువారం చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసచారి కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. చార్మినార్ రైన్‌బజార్‌కు చెందిన అక్సరీ బేగం(45) ఇళ్లల్లో పని చేసుకుంటూ దొంగతనాలకు పాల్పడేది. ఆమె కుమార్తె ఫాతిమా ప్రసవం కోసం సుల్తాన్‌బజార్ ప్రసూతి ఆసుపత్రిలో చేరింది. ఈ తరుణంలో ఓ గుర్తుతెలియని వ్యక్తి తనకు అప్పుడే పుట్టిన శిశువు కావాలని అందుకు రూ.50 వేలు ఇస్తానని చెప్పడంతో అందుకు అంగీకరించిన అక్సరీ బేగం ఈ నెల 5న ఆసుపత్రి నూతన భవనంలోని లేబర్ రూమ్‌కు వెళ్లి శిశువును అపహరించేందుకు యత్నించింది. అయితే అక్కడ టీజీఎస్‌పీఎఫ్ పోలీసులు, సెక్యూరిటీ సిబ్బంది ఉండడంతో తన ప్రయత్నాన్ని విరమించుకుంది. 6న ఉదయం మరోసారి లేబర్ రూమ్‌లోకి వెళ్లిన ఆమె శిశువును ఎత్తుకెళుతుండగా గుర్తించిన సెక్యూరిటీ సిబ్బంది రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకుని విచారించగా శిశువును కిడ్నాప్ చేస్తున్నట్లు అంగీకరించింది. సెక్యురిటీ సిబ్బంది సమాచారంతో సంఘటనా స్థలానికి చేరుకున్న సుల్తాన్‌బజార్ పోలీసులు అక్సరీ బేగంను అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించారు. ఆమెపై చార్మినార్, తుకారాంగేట్, అబిడ్స్, మీర్‌చౌక్ పోలీస్‌స్టేషన్లలో పలు కేసులు ఉన్నట్లు తెలిపారు. డాక్టర్ అనురాధ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

కలెక్టర్ ఇంటికి 'సర్వే' స్టిక్కర్



సర్వే స్టిక్కర్‌ను పరిశీలిస్తున్న అనుదీప్

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్డునంబర్-13లోని హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి నివాసానికి ఎన్యుమరేటర్లు వెళ్లారు. బుధవారం కుటుంబ సర్వే ప్రారంభం కాగా గురువారం బంజారాహిల్స్ బ్లాక్ సూపర్‌వైజరీ అధికారి భావ్‌సింగ్, ఎన్యుమరేటర్ లక్ష్మీలు కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ఇంటికి స్టిక్కర్ అంటించారు. అంతకుముందు ఇంటి నంబర్‌తో పాటు కుటుంబ యజమాని పేర్లను నమోదు చేసుకున్నారు. ఐఏఎస్ అధికారి నవీన్ మిట్టల్ ఇంటికి సైతం సర్వే సిబ్బంది స్టిక్కర్ అంటించారు.

నేడు డయల్ యువర్ డీఎం

షాద్‌నగర్‌రూరల్: ఆర్టీసీ ప్రయాణికులు ఎదుర్కొంటున్న సమస్యలు తెలుసుకునేందుకు శుక్రవారం డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు షాద్‌నగర్ డిపో మేనేజర్ ఉష గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమాన్ని ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ప్రయాణికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. 99592 26287 నంబర్‌లో సంప్రదించాలని ఆమె సూచించారు.

అంకుర్ రాణా చిక్కాడు!


- వ్యాపారి రమేష్ కుమార్ హత్య కేసులో నిందితుడు
- నగరంలో చంపి కర్ణాటకలో మృతదేహం దహనం
- క్రైమ్ సీన్ రీ-కన్‌స్ట్రక్షన్ కోసం తీసుకొచ్చిన పోలీసులు
- పోచారంలోని లాడ్జి నుంచి తప్పించుకున్న అంకుర్
- రాజస్థాన్‌లో అరెస్టు చేసిన కొడగు పోలీసు బృందం



నిందితుడు అంకుర్ రాణా

సాక్షి, సిటీబ్యూరో: హైదరాబాద్‌కు చెందిన వ్యాపారి రమేష్ కుమార్ హత్య కేసులో కీలక నిందితుడిగా ఉండి, పోచారంలో కర్ణాటక పోలీసు కస్టడీ నుంచి తప్పించుకున్న అంకుర్ రాణా ఎట్టకేలకు చిక్కాడు. ఐదు రోజుల పాటు వివిధ రాష్ట్రాల్లో గాలించిన కొడగు పోలీసులు బుధవారం రాత్రి రాజస్థాన్‌లో అరెస్టు చేశారు. ఇతను తప్పించుకుని పారిపోవడంపై పోచారం ఐటీ కారిడార్ ఠాణాలో కేసు నమోదై ఉండటంతో ఇక్కడి పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో రాణాను ప్రిజనర్స్ ట్రాన్సిట్ (పీటీ) వారెంట్‌పై తీసుకురావడానికి రాచకొండ అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. తుకారాంగేట్ ప్రాంతానికి చెందిన రమేష్ కుమార్ పోచారంలోని సంస్కృతి టౌన్‌షిప్‌లో నివాసం ఉండేవాడు. భువనగిరికి చెందిన ఆకుల లత అలియాస్ నిరుపమ బెంగళూరులో సాఫ్ట్‌వేర్ కంపెనీలో పని చేసేది. మాట్రిమోనియల్ సైట్ ద్వారా పరిచయమైన వీరు 2018లో వివాహం చేసుకున్నారు. రమేష్‌కు నిహారిక రెండో భార్య కాగా... నిహారికకు రమేష్ మూడో భర్త. బెంగళూరులోని రామమూర్తి నగర్‌లో వెటర్నరీ డాక్టర్‌గా స్థిరపడిన నిఖిల్ మైరెడ్డితో నిహారికకు సన్నిహిత సంబంధాలు ఉన్నాయి. కాగా తన రెండో భర్తతో కలిసి ఓ నేరంలో హరియాణా జైలుకు వెళ్లిన నిహారికకు తన సహ ఖైదీ ద్వారా అంకుర్ రాణాతో పరిచయం ఏర్పడింది. ఈ నేపథ్యంలో రమేష్‌ను చంపి, అతడి వద్ద ఉన్న నగదు కాజేయడం కోసం గత నెల 1న అంకుర్‌తో కలిసి నిహారిక హైదరాబాద్ వచ్చింది. ఈ నెల 3న రమేష్‌తో కలిసి అతడి కారులో బయలుదేరిన వీరు పీర్జాదిగూడ కమాన్ సమీపంలో తమ పథకాన్ని అమలు చేశారు. రమేష్‌కు ఉరి బిగించి చంపేసి... నిఖిల్ సలహాతో మృతదేహాన్ని కారులో తీసుకెళ్లి ఊటీ సమీపంలోని సుంటికొప్పలో (కర్ణాటక) ఉన్న కాఫీ ఎస్టేట్‌లో పెట్రోల్ పోసి కాల్చేశారు. గత నెల 8న సగం కాలిన మృతదేహానికి సంబంధించి కొడగు పోలీసులు కేసు నమోదు చేసుకుని నిహారిక, నిఖిల్, అంకుర్‌లను అరెస్టు చేశారు. కోర్టు అనుమతితో వీరిని కస్టడీలోకి తీసుకుని క్రైమ్ సీన్ రీ-కన్‌స్ట్రక్షన్ కోసం గత గురువారం సిటీకి తీసుకువచ్చారు. పోచారంలోని బృందావన్ లాడ్జిలోని మూడో అంతస్తులో ఉన్న గదిలో బస చేశారు. శుక్రవారం తెల్లవారుజామున అందరూ నిద్రిస్తుండగా తన చేతికి ఉన్న సంకెళ్లు తీసేసిన అంకుర్ కిటికీ నుంచి కిందికి దూకి పరారయ్యాడు. దీనిపై పోచారం ఐటీ కారిడార్ ఠాణాలో కేసు నమోదైంది.

ఐదు రాష్ట్రాల్లో గాలించి పట్టుకున్నాం



అంకుర్ రాణా తనతో పాటు పోలీసులకు సంబంధించిన ఓ సెల్‌ఫోన్ కూడా ఎత్తుకెళ్లాడు. ఈ విషయం తెలిసిన వెంటనే అప్రమత్తమయ్యాం. అతడిని పట్టుకోవడానికి ఆరు బృందాలను రంగంలోకి దింపాం. అంకుర్ హైదరాబాద్ నుంచి ఉత్తరప్రదేశ్ వెళ్లాడు. అక్కడి నుంచి ఉత్తరాఖండ్, ఢిల్లీ, హరియాణాల్లో సంచరించాడు. ఎన్ని రాష్ట్రాల్లో తిరుగుతున్నా నీడలా వెంటాడాం. ఎట్టకేలకు రాజస్థాన్‌లో మా ప్రత్యేక బృందానికి చిక్కాడు. అతడి నుంచి సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నాం. అంకుర్ అరెస్టు విషయంపై అక్కడి పోలీసులకు సమాచారం ఇచ్చాం.

– 'సాక్షి'తో ఫోన్‌లో కొడగు ఎస్పీ కె.రామరాజన్

మహిళలు హక్కులు సాధించుకోవాలి



అవగాహన కార్యక్రమంలో కళాశాల సిబ్బంది, పోలీసులు, విద్యార్థులు

శంకర్‌పల్లి: మహిళలు, విద్యార్థినిలు రాజ్యాంగం కల్పించిన హక్కులను సాధించుకోవాలని ఇక్ఫాయ్ డీమ్డ్ విశ్వవిద్యాలయం డీన్ ఎల్.ఎస్ గణేశ్ సూచించారు. గురువారం మండలంలోని దొంతాన్‌పల్లిలో గల ఇక్ఫాయ్ డీమ్డ్ విశ్వవిద్యాలయంలో సైబరాబాద్ షీ టీమ్స్, మోకిల, శంకర్‌పల్లి పోలీసుల ఆధ్వర్యంలో కళా బృందంతో మహిళల హక్కులపై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ప్రస్తుతం సమాజంలో మహిళలపై జరిగే అత్యాచారాలు, లైంగిక వేధింపులు, గృహహింస వంటి విషయాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. వర్సిటీ డీన్, పోలీసులు మాట్లాడుతూ.. భారత రాజ్యాంగంలో మహిళలకు విస్తృతమైన అధికారాలు కల్పించారని, వాటిని ప్రతిఒక్కరూ కచ్చితంగా సద్వినియోగం చేసుకోవాలన్నారు. వేధింపులకు గురైన వారు నేరుగా షీ టీమ్స్‌కి ఫిర్యాదు చేయాలని, వారి వివరాలను గోప్యంగా ఉంచి, తగు న్యాయం చేస్తామని పోలీసులు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కళాశాల రిజిస్ట్రార్ ప్రొ.విజయలక్ష్మి, డైరెక్టర్ ఆఫ్ ఫ్యాకల్టీ ప్రొ.రవిశేఖరరాజు, లా స్కూల్ ప్రొ.జయంతిరెడ్డి, షీ టీమ్స్ అధికారి సునీత, మోకిల సీఐ కోటేశ్వర్ రావు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.